క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



చారకొండ: మండలంలోని జూపల్లిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ జయసుధ బుధవారం పరిశీలించారు. పనిచేసే ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం చేయాల్సిన పని, జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అనంతరం కూలీల మస్టర్లను తనిఖీ చేసి హాజరు నమోదు చేశారు. వారి వెంట టీఏ యాదయ్య, ఈసీ, ఎఫ్ఏ తదితరులు ఉన్నారు.

'పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే'



తెలకపల్లి: పేదల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండానేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గడ్డంపల్లిలో సీపీఎం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కులం, మతం పేరుతో ప్రజలను విడదీసి పాలించేందుకు ప్రయత్నిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులపై పాషవికంగా పని గంటలు పెంచి కార్పొరేట్‌లకు దోచిపెడుతుందన్నారు. సీపీఎం శాఖ కార్యదర్శి జగదీశ్వర్, మల్లయ్య, బిచన్న, బలీశ్వర్, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

కల్వకుర్తి సీఐగా పార్థసారధి

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి నూతన సీఐగా పార్థసారధి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ సైదులు నుంచి నూతన సీఐ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సైదులు జిల్లాలోని డీసీఆర్‌బీ కి బదిలీ కాగా, హైదరాబాద్ ఐజీ కార్యాలయం నుంచి పార్థసారధి కల్వకుర్తి బదిలీపై వచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీఐ ఆకస్మిక బదిలీ జరిగిందని పోలీస్ అధికారులు తెలియజేశారు.

నిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులకు సీపీసీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లేబర్ అధికారి వేణుగోపాల్ మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులందరూ కార్మిక కార్డులు తీసుకొని లబ్ధి పొందాలని చెప్పారు. కార్యక్రమంలో మహమూద్, భాస్కర్, అజయ్, వైద్య సిబ్బంది, పెంట్లవెల్లి గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



అమ్రాబాద్: పదర మండల పరిధిలోని వంకేశ్వరానికి చెందిన రాజగిరి వెంకటేశ్వర్లుకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అందజేశారు. వెంకటేశ్వర్లు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు రూ.2.25లక్షలు అందజేశామని ఎమ్మెల్యే తెలియజేశారు. విష్ణుమూర్తి, శంకర్‌మాదిగ, సురేష్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ చేసిన ఎంపీ..

అచ్చంపేట: పట్టణంలో బల్మూర్ మండలం పొలిశెట్టిపల్లికి చెందిన ఆకారపు వెన్నెల కుటుంబ సభ్యులకు ఎంపీ రాములు సీఎం సహాయ నిధి రూ.లక్ష చెక్కును అందజేశారు. వెన్నెల కుమారుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్సకు అయిన ఖర్చుల నిమిత్తం ఈ చెక్కు అందజేశారు. మాజీ ఎంపీపీ కర్నాకర్‌రావు, రాంచందర్, ఖలీల్, పరమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలి

నాగర్‌కర్నూల్ రూరల్: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని వీఓఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పర్వతాలు డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



జక్కా దేవిక, 9.8 పాలెం



గణేష్, 9.7 బిజినేపల్లి



దినేష్, 9.7 బిజినేపల్లి



సునీల్ 9.7 బిజినేపల్లి



ఎన్.శివకుమార్, 9.3, బిజినేపల్లి

బిజినేపల్లి: మండలంలోని పాలెం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జక్కా దేవకి 9.8 జీపీఏతో మండలంలో ప్రథమ ర్యాంకు సాధించింది. పాలెం జెడ్పీ హెచ్‌ఎస్, టీఎస్‌ఎంహైచ్ఎస్ పాఠశాల, సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ భాస్కర్ రెడ్డి తెలియజేశారు. జక్కా దేవకిని ఎంఈఓ అభినందించి సత్కరించారు. పాలెం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన చందన 9.5 జీపీఏ, వి.పల్లవి 9.0 జీపీఏ సాధించింది. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన సునీల్, గణేష్, దినేష్ 9.7 జీపీఏ సాధించారు. శివకుమార్ 9.3 జీపీఏ సాధించాడు. గంగారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన అశోక్ 9.3 జీపీఏ, పూజ 9.0 సాధించింది. నందివడ్డెమాన్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన సింధూ 9.2 జీపీఏ, మహేశ్వరీ 9.0 జీపీఏ సాధించింది.

94 శాతం ఉత్తీర్ణత..

విద్యాశాఖ బుధవారం వెల్లడించిన పది ఫలితాల్లో తిమ్మాజీపేట మండలానికి చెందిన విద్యార్థులు అంతంత మాత్రమే తమ ప్రతిభను కనబర్చారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏ ఒక్కటి కూడా 100శాతం ఉత్తీర్ణత సాధించలేకపోయారు. తిమ్మాజీపేట కేజీబీవీ విద్యార్థులు 94 శాతం ఉత్తీర్ణత సాధించగా.. జెడ్పీహెచ్‌ఎస్ ఆవంచ, తిమ్మాజీపేటలో 92 శాతం ఉత్తీర్ణత సాధించారు.



అఖిల్ గౌడ్ 10

తాడూరులో 95 శాతం ఉత్తీర్ణత

తాడూరు: మండలంలోని 95 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. భల్లాన్‌పల్లి, ఐతోలు, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 6 ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలో మొత్తం 390 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 364 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

తెలకపల్లి: మండలంలోని ప్రభుత్వ, గురుకుల, కేజీబీవీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మొత్తం 703 మంది విద్యార్థులకు గాను 668 విద్యార్థులు ఉత్తీర్ణత(95శాతం) సాధించారు. 35 మంది ఫెయిలయ్యారు. పెద్దూరు పాఠశాలలో 15కు 15 మంది, పెద్దపల్లి పాఠశాలలో 20కి 20 మంది, ఆలేరులో 34కు 34 మంది, లక్నారం పాఠశాలలో 11కు 11 మంది విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. గౌరెడ్డిపల్లి పాఠశాలలో 101కు 100 మంది, కార్వంగ పాఠశాలలో 38కి 34 మంది, తెలకపల్లి పాఠశాలలో 89కి 74, గడ్డంపల్లి పాఠశాలలో 12కి 11 మంది ఉత్తీర్ణత సాధించారు. మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర పాఠశాలలో ఎం భానుప్రకాష్, ఎస్ చరణ్, అఖిల్ గౌడ్ 10 జీపీఏ సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంఈఓ చంద్రుడు అభినందించారు.

గురుకులాల్లో..

కల్వకుర్తి టౌన్: గురుకులాల్లో ఈస్ట్ రీజియన్ పరిధిలోని నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలో పది ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని గురుకులాల ఈస్ట్ రీజియన్ అధికారి(ఆర్సీఓ) వనజ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రీజియన్ పరిధిలో 98.71 శాతం ఫలితాలను సాధించామని చెప్పారు. జిల్లాలో లింగాల, మున్ననూర్, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, బిజినేపల్లి గురుకుల పాఠశాలలో 100 శాతం ఫలితాలు వచ్చాయని తెలియజేశారు.

చారకొండ: మండలంలో 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ శంకర్ నాయక్ తెలియజేశారు. చారకొండ నలుగురు, జూపల్లి పాఠశాలలో ఒకరు, కేజీబీవీలో ముగ్గురు ఫెయిల్ అయినట్లు చెప్పారు. చారకొండ ప్రభుత్వ పాఠశాలకు చెందిన సింధూ 9.2, నిఖిల్ రెడ్డి 8.8, జూపల్లికి చెందిన శ్రీజ 8.7, శ్రావణి 8.7 జీపీఏ సాధించినట్లు ఎంఈఓ శంకర్ నాయక్ తెలియజేశారు.

బాలికలదే హవా..



శ్రీజ 9.3



వైష్ణవి 9.7 గురుకుల



భవాని 9.3 నర్సాయిపల్లి



10 జీపీఏ సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోడేరు: పదో తరగతి పరీక్షల్లో బాలికలు పైచెయ్యిగా నిలిచారు. కోడేరు జెడ్పీ పాఠశాలలో 76 మంది విద్యార్థులకు గాను 62 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆదర్శ పాఠశాలలో 71 మందికి గాను 61 మంది ఉత్తీర్ణత సాధించారు. శ్రీజ విద్యార్థి 9.3 జీపీఏ సాధించింది. రాజాపూర్‌లో 25 మందికి గాను 21 మంది ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బాలో 44 మందికి గాను 43 మంది ఉత్తీర్ణత సాధించారు. మైలారంలో 8 మందికి గాను ఆరుగురు ఉత్తీర్ణత సాధించారు. నర్సాయిపల్లిలో 12 మందికి గాను 12 మంది ఉత్తీర్ణత సాధించారు. భవాని 9.3 జీపీఏ సాధించింది. కొండ్రావుపల్లిలో 14 మందికి గాను 9మంది ఉత్తీర్ణత సాధించారు. ఎత్తం పాఠశాలలో 17 మందికి గాను 10 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గురుకుల పాఠశాలలో 72 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 72 మంది ఉత్తీర్ణత సాధించారు. వైష్ణవి 9.7 జీపీఏ సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం రష్మిక తెలియజేశారు.

కొల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. మండలంలోని 16 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 562 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 528 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 93.95 నమోదైంది. కొల్లాపూర్ పట్టణంలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాల, కేజీబీవీ స్కూల్, ప్రభుత్వ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ బీసీ బాలుర గురుకుల పాఠశాల, గర్ల్స్ హైస్కూల్‌తో పాటు, సింగోటం హైస్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. బీసీ బాలుర గురుకుల పాఠశాలలో 10 జీపీఏ సాధించారు.



భవ్యశ్రీ 10

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిర్మలాపూర్ ఉన్నత పాఠశాల సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, ఆల్ సైన్స్ ఉన్నత పాఠశాల, అక్షర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఫలితాలు సాధించినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

గోదల్, తుమ్మెన్‌పేటలో వంద శాతం ఉత్తీర్ణత



ఎస్ సిరి, 10 వెల్టూర్



కె అర్చన 10 వెల్టూర్



ఎండి.అశ్రఫ్, 10 దోమలపెంట



భార్గవి 9.5 అమ్రాబాద్



సింధూ 9.2 చారకొండ

బల్మూర్: మండలంలోని కేజీబీవీ, గోదల్, తుమ్మెన్‌పేట ఉన్నత పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మండల టాపర్‌గా కొండనాగుల విద్యార్థి పి.మధు(9.8) జీపీఏ సాధించాడు. మండలంలోని కేజీబీవీలో 40 మంది, గోదల్‌లో 15 మంది, తుమ్మెన్‌పేటలో 30 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. అందరూ ఉత్తీర్ణత సాధించారు. బల్మూర్‌లో 72 మందికి గాను 69 మంది 96 శాతం, కొండనాగులలో 130 మందిలో 128 మంది 98.46 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటారు.

గురుకుల విద్యార్థినుల ప్రతిభ

ఉప్పునుంతల: వెల్టూర్ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు సిరి, అర్చన 10 జీపీఏ సాధించి మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. మీనాక్షి, నందిని 9.8 జీపీఏ సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. వెల్టూరు మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల, ఉప్పునుంతల, కాంసానిపల్లి, వెల్టూరు, పెనిమిళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లతో పాటు ఉప్పునుంతల కేజీబీవీలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ఇన్‌చార్జ్ ఎంఈఓ రామారావు తెలియజేశారు.

దోమలపెంట: టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో ఈగలపెంటలో నిర్వహిస్తున్న డీఏవీ ఆంగ్ల పాఠశాల విద్యార్థి ఎండీ అశ్రఫ్ పది జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలియజేశారు. దోమలపెంటలోని ప్రభుత్వ పాఠశాల నుంచి 14 మంది పరీక్షలకు హాజరై అందరూ ఉత్తీర్ణులయ్యారని హెచ్‌ఎం నాగయ్య తెలియజేశారు. ఇద్దరు విద్యార్థులు డి.కావ్య, టి.సంధ్య 9 జీపీఏ సాధించినట్లు వివరించారు.

అమ్రాబాద్‌లో 98 శాతం

అమ్రాబాద్: మండలంలో 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 443 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 436 మంది ఉత్తీర్ణులయ్యారు. మన్ననూర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు నందిని, శైలజ, అమ్రాబాద్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థిని భార్గవి 9.5 జీపీఏ సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచారు. పదర మండలంలో 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తం 132 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 131 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

74శాతం ఉత్తీర్ణత

వెల్దండ: మండలంలో 11 ఉన్నత పాఠశాలల్లో 74 శాతం వచ్చినట్లు ఎంఈఓ శంకర్‌నాయక్ వెల్లడించారు. ఆయా పాఠశాలల్లో అత్యధికంగా 9.5 జీపీఏ సాధించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కోడేరులో డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కోడేరు: ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రం నుంచి డబుల్‌లైన్ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.7.50 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాగులపల్లిలో రూ.2.10 కోట్లతో నాగులపల్లి నుంచి రాజాపూర్ వెళ్లే బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. అనంతరం ముత్తిరెడ్డిపల్లి బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.45 కోట్ల నిధులు మంజూరు కావడంతో పనులకు భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడారు. సీఎం కేసీఆర్, కేటీఆర్ సహకారంతో కొల్లాపూర్ నియోజకవర్గంలో ఎన్నో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లోని పనులకు శంకుస్థాపన చేస్తూ.. పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో కోడేరు మండలం వెనుకబాటుకు గురైందని, ఇప్పుడు తన హయాంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. అనంతరం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కులు, తుర్కదిన్నెలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు మధ్యదళారులను ఆశ్రయించకుండా వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సింగిల్‌విండో చైర్మన్ చిన్నారెడ్డి, డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సునీత, రఘువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, సర్పంచ్ వెంకటస్వామి, జగదీశ్వర్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పెద్దకొత్తపల్లి: మండలంలోని మారెడుదిన్నెలో మారెళ్ల మైసమ్మ డ్యాంకు వెళ్లే రహదారి రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొన్నేళ్లు రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుడటంతో ప్రజలను దృష్టిలో ఉంచుకొని రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. గ్రామాల అభివృద్ధి తమ ధ్యేయమని అన్నారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలి



బహుమతి అందజేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

కల్వకుర్తి రూరల్: క్రీడాకారులు తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని మార్చాలలో క్రికెట్ పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. విజేతలకు ఐక్యత ఫౌండేషన్ సహకారంతో మొదటి స్థానంలో నిలిచిన వట్టెపు కింగ్స్ జంట్‌కు రూ.60 వేల మొదటి బహుమతి, రెండో స్థానంలో నిలిచిన శివరామ్ బులెట్స్‌కు రూ.30 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.20 వేల చెక్కులను, షీల్డ్‌లను బహూకరించారు. సునిత వెంకట్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, బాలయ్య, శ్రీను, కృష్ణారెడ్డి, జంగారెడ్డి, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపును ముట్టడిస్తాం..



మాట్లాడుతున్న కొత్తపల్లి కుమార్

నాగర్‌కర్నూల్ రూరల్: గువ్వల తన వైఖరి మార్చుకోకుంటే త్వరలో అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపును ముట్టడిస్తామని బీఎస్పీ నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్ హెచ్చరించారు. బుధవారం కొల్లాపూర్ చౌరస్తాలోని బీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఎస్పీని, ఆర్‌ఎస్‌పీని విమర్శించడం గువ్వల బాలరాజుకు తగదని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 36 మంది ఎంపీలతో మద్దతు ఇచ్చిన తొలి జాతీయ నాయకురాలు మాయావతి అని గుర్తుచేశారు. మునుగోడు ఎన్నికల్లో బీఎస్పీకి వచ్చిన ఓట్లు ఎన్ని అడుగుతున్న గువ్వల, 2004లో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు అయిన నిరంజన్‌రెడ్డి, మెట్టుకాడి శ్రీనివాసు, నాగర్‌దొడ్డి వెంకటరాములు, లక్ష్మారెడ్డిలకు ఎన్ని ఓట్లు వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రధాని అవుతారని అనుకోవడం పైశాచిక ఆనందమన్నారు. బీఎస్పీ జిల్లా కార్యదర్శి రాంచందర్, శ్రీనివాసులు, పృధ్వీరాజ్, కల్యాణ్, బాలనాగులు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

లింగాల: దివ్యాంగుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని మండల అధ్యక్షుడు ఎండీ.జబ్బార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దాడి వెనుక ఉన్న కుట్రను పోలీసులు బయటకు తీయాలని కోరారు. న్యాయం జరుగకుంటే ఆందోళన చేపడుతామన్నారు.

ఘనంగా పీవీరావు జయంతి



అచ్చంపేట: పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో గురువారం మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీరావు 74వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాల మహానాడు నాయకులు మాట్లాడారు. పీవీరావు వ్యక్తి కాదని, ఒక శక్తిగా ఎదిగిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంద మల్లికార్జున్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జీవన్‌కుమార్, నాసరయ్య, రామనాథం, శ్రీనివాసులు, లింగయ్య, వేద వాస్, సుధాకర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

మనువాద పాలకుల విధానాలను ప్రతిఘటిద్దాం

నాగర్‌కర్నూల్ రూరల్: రాజ్యాంగ హక్కులను హరిస్తూ.. మనువాద పాలకుల విధానాలను ప్రతిఒక్కరూ ఐక్యంగా ప్రతిఘటించాలని కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం సింగిల్ విండో ఫంక్షన్‌హాల్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరిస్తున్న బీజేపీ మతోన్మాద విధానాలను ఐక్యంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కులం, మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రిజర్వేషన్లకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ రెండో విడత దళితబంధు నియోజకవర్గానికి 1,500 మందికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సభ్యులు నియామకంలో నిర్లక్ష్యం వీడాలని, బాధితులకు రావాల్సిన ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతటి కాశన్న, పరశురాములు, సలీం, శ్యాంసుందర్, శివవర్మ, కృష్ణమూర్తి, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



లింగాలలో మెరుగైన ఫలితాలు



శ్రీను 9.5 లింగాల



శివనర్సింహ 9.3 అంబట్‌పల్లి

లింగాల: మండలంలో మెరుగైన ఫలితాలు సాధించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో మొత్తం 257 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 250 మంది ఉత్తీర్ణత సాధించారు. సాంఘీక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన 83 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. అందరూ పాసయ్యారు. మండల టాపర్‌గా శ్రీను 9.5 జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపాల్ వినోద్‌ఖన్నా తెలియజేశారు. అంబట్‌పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 36 మంది విద్యార్థుల్లో 33 మంది పాసయ్యారు. ద్వితీయ స్థానంలో వై. శివనర్సింహ 9.3 జీపీఏ సాధించినట్లు హెచ్‌ఎం తాహెర్ పాష తెలిపారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో అందరూ పాసయ్యారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 79 మందికి గాను 74 మంది, కస్తూర్బా బాలికలలో 37 మందికి గాను 36 మంది ఉత్తీర్ణత సాధించారని పాఠశాలల హెచ్‌ఎంలు శేఖర్, శారద తెలియజేశారు.

గొర్రెల పథకంలో లబ్ధిదారులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న రాజేష్

కోడేరు: మండలంలోని ఇంద్రకల్ రైతు వేదికలో బుధవారం మండల పశువైద్యాధికారి ఆధ్వర్యంలో రెండో విడత గొర్రెల పంపిణీ పథకంలో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి రాజేష్‌కుమార్ మాట్లాడారు. ఎంపికైన లబ్ధిదారులు డాక్యుమెంటేషన్‌కు సంబంధించిన దరఖాస్తులు పూర్తి చేసేందుకు కులం, ఆధార్, బ్యాంకు అకౌంట్, నామిని వివరాలను పూర్తి చేసి పశువైద్య కార్యాలయంలో అందజేయాలన్నారు. లబ్ధిదారుల వాటాకు సంబంధించిన డీడీలు దరఖాస్తు వెంట జతచేయాలన్నారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ సమ్మద్‌పాష, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు రమణ మాట్లాడారు. ప్రభుత్వం అందించే గొర్రెలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ సబిత, ఆయా గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి పూజ



కల్వకుర్తి: ఆమనగల్ మండలంలోని మంగల్‌పల్లిలో గౌడ సంఘం భవన నిర్మాణానికి సంఘం ఆధ్వర్యంలో బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రమేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు హాజరయ్యారు.

బీజేపీ నేతల నిరసన

కల్వకుర్తి: పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం రాత్రి బీజేపీ నేతలు ధర్నా నిర్వహించారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి వాట్సప్‌లో ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీకి వ్యతిరేకంగా పోస్ట్ చేశాడని ఆ పార్టీ శ్రేణులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు అతడిని స్టేషన్‌కు పిలిపించి కొట్టారని ఆరోపిస్తూ.. బీజేపీ నాయకులు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఎస్ఐ రమేష్ వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఫోన్‌లో ఎస్పీ మనోహర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కొనసాగుతున్న నిరసన



కల్వకుర్తిలో ఆటలు ఆడుతున్న కార్యదర్శులు

కల్వకుర్తి రూరల్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం 13వ రోజు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బతుకమ్మ, దాండియా ఆటలు ఆడుతూ నిరసన తెలిపారు.

బెదిరించడం అప్రజాస్వామికం

నాగర్‌కర్నూల్ రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరించడం అప్రజాస్వామికమైన చర్య అని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు జక్క రామస్వామి అన్నారు. బుధవారం పంచాయతీ కార్యదర్శుల ధర్నాను సందర్శించి మాట్లాడారు. ఉద్యోగ భద్రత విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా వారిని భయభ్రాంతులకు గురిచేయడం సరైన విధానం కాదన్నారు.

సమ్మెకు బీజేపీ మద్దతు

కొల్లాపూర్: పట్టణంలో పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు మద్దతు ప్రకటించారు. సమ్మె శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించారు. వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన మాట ప్రకారం వారిని రెగ్యులరైజ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు గతంలో ఇచ్చిన జీఓలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. పంచాయతీ కార్యదర్శుల పోరాటాలకు బీజేపీ అండగా ఉంటుందన్నారు.